నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 23 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, నవంబర్ 22 : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, మాజీ ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, మాజీ ఎంపీటీసీ సంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బుర్స పోశమల్లు, మాజీ ఉప సర్పంచ్ కొడిపె వెంకటేశ్, నాయకులు దుర్గం భరద్వాజ్, జుమ్మిడి ఆనందరావు, పందిర్ల మధునయ్య, వడ్డె పోచం, వెంకటేశ్ ఉన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి, నవంబర్19 : రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ముత్యంపేట, కన్నెపల్లి, గూడెం గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల నిర్వాహకులు, ఏఈవోలకు పలు సూచనలు చేశారు. వరి కోత సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతే కోయాలన్నారు. పొలం వద్దే ధాన్యాన్ని ఆరబెట్టుకొని తీసుకురావాలన్నారు. అనంతరం తహసీల్దార్, ఐకేపీ కార్యాలయాలను సందర్శించారు. దండేపల్లిలోని పీహెచ్‌సీ తనిఖీ చేశారు. రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, డీటీ విజయ, ఆర్ భూమన్న, ఏవో అంజిత్‌కుమార్, ఏపీఎం బ్రహ్మయ్య, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

సిర్పూర్(యు)లో చలి మంట కాగుతున్న స్థానికులు

చలి పులి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై పంజా విసిరిన చలి

● ఒక్కసారిగా పడిపోయిన ఉష్ణోగ్రతలు ● రాష్ట్రంలోనే అత్యల్పంగా సిర్పూర్(యు)లో 9.9 డిగ్రీలు
● రాత్రే కాదు.. పగలూ ఇగమే ● తిరిగి వెళ్లిన 'జానీ'

మంచిర్యాల, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/సిర్పూర్(యు), నవంబర్ 22 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై చలి పంజా విసిరింది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోగా, గడ్డ కట్టుకుపోయే పరిస్థితి తలెత్తింది. శుక్రవారం రాష్ట్రంలోనే అత్యల్పంగా సిర్పూర్(యు)లో కనిష్ఠంగా 9.9 డిగ్రీలు నమోదయ్యాయి. తిర్యాణిలో 11, కెరిమెరి, వాంకిడి, రెబ్బెన, ఆసిఫాబాద్, చింతలమానేపల్లి, కాగజ్‌నగర్, బెజ్జూర్, లింగాపూర్‌లలో 12 నుంచి 14, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో 11.5, బజార్‌హత్నూర్‌లో 11.8 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ప్రజానీకం గజగజ వణికిపోయింది. ఉదయం ఎనిమిదైనా మంచు తొలగకపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రాత్రివేళల్లోనే కాకుండా పగలంతా కూడా ఇగం పెట్టింది. ఉదయం.. సాయంత్రం చిన్నా పెద్దలంతా ఒకేచోట చేరి నెగడి మంటలు వేసుకోవడం కనిపించింది.

గాదిగూడ మండలం ఝరి నుంచి తిరిగి వెళ్లిపోతున్న పెద్దపులి జానీ

తిరిగి వెళ్లిపోయిన 'జానీ'

మంచిర్యాల, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆడ తోడు కోసం మహారాష్ట్ర నుంచి ఉమ్మడి జిల్లాలోకి వచ్చిన పెద్దపులి జానీ తిరిగి మహారాష్ట్రకు వెళ్లిపోయింది. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నెల రోజుల్లో దాదాపు 350 కిలోమీటర్లు ఈ పులి పర్యటించింది. ఆడతోడును వెతుక్కుంటూ అడవి మొత్తాన్ని జల్లెడ పట్టింది. అన్వేషణ సఫలం కాకపోవడంతో ఆసిఫాబాద్ జిల్లా కెరిమెరి నుంచి యూ టర్న్ తీసుకున్న జానీ.. గాదిగూడ మండలం ఝరి నుంచి మహారాష్ట్రలోని పిప్పల్ కోటి మీదుగా తిప్పేశ్వర్ ఫారెస్ట్‌లోకి వెళ్లిపోయినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఏజెన్సీ మండలాల్లో పులి సంచరిండం ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేసింది.

మంచిర్యాల మార్కెట్‌లోని తై బజార్

మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని మేకల మండి

జీఎస్టీ ఎగ్గొడుతున్న బల్దియా

● తై బజార్, మేకల మండీల ట్యాక్స్ వసూళ్లపై మొద్దునిద్ర ● 2021 నుంచి 2024 వరకు సర్కారుకు రూ.24.72 లక్షలు ఎగవేత ● అన్ని మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి

మంచిర్యాల, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హోటల్‌కెళ్లి భోజనం చేసినా.. చివరకు చిన్న పిల్లలు తాగే పాలు కొన్నా.. సామాన్యుల నుంచి ముక్కు పిండి మరీ జీఎస్టీ వసూలు చేసే సర్కారు, అదే ప్రభుత్వ సంస్థల నుంచి రావాల్సిన కోట్లాది రూపాయల ట్యాక్స్‌లపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఇలా మంచిర్యాల మున్సిపాలిటీ నుంచి ప్రభుత్వానికి రూ.24.72,703 జీఎస్టీ రావాల్సి ఉండగా, యంత్రాంగం ఎగ్గొట్టింది. యేటా బల్దియా పరిధిలో తై బజార్, మేకల మండి, స్లాటర్ హౌస్, మటన్ మార్కెట్ తదితర దుకాణాలకు వేలం పాట నిర్వహిస్తుండగా, అందులో వచ్చిన మొత్తంపై 18 శాతం జీఎస్టీ మున్సిపాలిటీకి చెల్లించాలి. మున్సిపాలిటీకి వసూలైన జీఎస్టీని ప్రభుత్వానికి కట్టాలి. కానీ.. గత నాలుగేళ్లుగా వేలం దక్కించుకున్న వారి నుంచి జీఎస్టీ వసూలు చేయడంలో మున్సిపల్ యంత్రాంగం విఫలమవుతున్నది.

జీఎస్టీ కట్టని వారిపై చర్యలేవి..

నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ వేలం ప్రకటన విడుదల చేసినప్పుడు అందులో జీఎస్టీ గురించి ప్రత్యేకంగా పేర్కొంటారు. ఎవరు వేలం పాట దక్కించుకుంటారో ఆ మొత్తంపై 18 శాతం జీఎస్టీ కలిపి కట్టాలి. జీఎస్టీ లేకుండా డబ్బులు మాత్రమే కట్టడానికి, మున్సిపాలిటీ తీసుకోవడానికి వీలులేదు. ఈ మేరకు నిబంధనలు రూపొందించిన అధికారులే వేలం పాడిన డబ్బులు మాత్రమే తీసుకొని, జీఎస్టీ కట్టించుకోవడం లేదు. నిబంధనలు పెట్టడానికే కానీ.. వాటిని అమలు చేయాల్సిన అవసరం లేదా అన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఈ విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు సైతం అనుమానాలకు తావిస్తున్నది. ఇంటి పన్నులు, ఆస్తి పన్నుల విషయంలో కఠినంగా వ్యవహించే బల్దియా అధికారులు.. లక్షలాది రూపాయల జీఎస్టీ ఎగొట్టిన వేలం దారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇది అధికారుల నిర్లక్ష్యం.. చేతివాటం తప్ప మరొకటి కాదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని అన్ని బల్దియాల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తున్నది.

తై బజార్‌లో డబ్బులు తీసుకోవడం లేదు..

మంచిర్యాలలో ప్రస్తుతం తై బజార్‌లో షాపులు నిర్వహించే వారి నుంచి వేలం దక్కించుకున్న వారు ఎలాంటి డబ్బులు వసూలు చేయడం లేదు. ఎవరూ కట్టాల్సిన అవసరం లేదని స్థానిక ఎమ్మెల్యే పీఎస్సార్ మాట ఇచ్చారు. ఈ నిర్ణయంపై చిరు వ్యాపారులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. తై బజార్ సహా మేకలమండి, స్లాటర్‌హౌస్/మటన్ మార్కెట్‌లపై జీఎస్టీలు ఎందుకు వసూలు చేయడం లేదన్నది అంతుబట్టడం లేదు. సరే తై బజార్ ఒక్కటి పక్కన పెట్టారనుకున్నా.. నిబంధనల ప్రకారం జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వడానికి మాత్రం వీలులేదు. సరే చిల్లర వ్యాపారుల కోసం అనుకొని మినహాయింపు ఇచ్చినా.. మిగిలిన వారి నుంచైనా వసూలు చేయాలి కదా. న్యాయంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని ఎగొట్టేంత ధైర్యం ఎలా వచ్చింది. అధికారులకు మామూళ్లు ముడుతున్నాయా.. లేకపోతే రాజకీయ ఒత్తిడులు ఏమైనా ఉన్నాయా.. అన్న చర్చ నడుస్తున్నది. మరి ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు పెండింగ్ జీఎస్టీ వసూళ్లపై దృష్టి సారిస్తారా.. లేదా అన్నది ఆసక్తిగా మారింది.

నోటీసులు ఇస్తున్నాం

తై బజార్, మేకలమండి నిర్వాహకులకు జీఎస్టీ చెల్లించాలని నోటీసులు ఇచ్చాం. వేరే మున్సిపాలిటీల్లో ఎక్కడా జీఎస్టీ తీసుకోవడం లేదని చెబుతున్నారు. ఎక్కడా లేనిది ఇక్కడే ఎందుకు అంటున్నారు. అయినా మేం నోటీసులు ఇస్తున్నాం. వసూలు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. చెల్లించని పక్షంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అంశాన్ని మున్సిపల్ కమిషనర్ పరిశీలిస్తారు.

- శ్రీనివాస్‌రెడ్డి, మంచిర్యాల మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్

సంవత్సరం	మేకల మండి వేలం	కట్టాల్సిన జీఎస్టీ	తైబజార్ వేలం	కట్టాల్సిన జీఎస్టీ	స్లాటర్ హౌస్/మటన్ మార్కెట్	కట్టాల్సిన జీఎస్టీ
2020-21	19,65,000	3,53,700	12,26,000	3,20,000	00	00
2021-22	12,26,000	2,20,680	16,52,000	2,97,360	6100	1,098
2022-23	25,40,000	4,57,200	18,37,200	3,30,696	1,15,000	20,700
2023-24	13,18,166	2,37,269	13,00,000	2,34,000	00	000
మొత్తం	70,49,166	12,68,849	60,15,200	11,82,056	1,21,100	21,798


పోతెపల్లిలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

బెజ్జూర్‌లో ఆర్ఎస్పీ పర్యటన

బెజ్జూర్, నవంబర్ 22 : మండలంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం పర్యటించారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు ప్రాణహిత నదిలో మునిగి చనిపోగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబాలకు ఆర్థిక సాయమందించారు. అనంతరం కుష్నపల్లికి చేరుకొని కార్యకర్తలతో మాట్లాడారు. అదే గ్రామంలో మాండూరి అనే వ్యక్తి ప్రమాదంలో గాయపడగా.. అతడిని కలిసి ధైర్యం చెప్పారు. సలుగుపల్లి చౌరస్తాలో వెల్డింగ్ షాప్‌ను ప్రారంభించారు. లంబాడీగూడలో స్వెరోస్ స్టడీ సెంటర్‌ను ప్రారంభించారు. మర్తిడి గ్రామ కార్యకర్తలను కలిసి మాట్లాడారు. పోతెపల్లిలో గ్రామస్తులు ఆర్ఎస్పీకి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన వారితో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ కన్వీనర్ లెండుగురి శ్యాంరావు, నియోజకవర్గ కో కన్వీనర్ కొండా రాం ప్రసాద్, నాయకులు ఎంఏ కలీం, రాజ్ కుమార్, ఖాజా మోహినుద్దీన్, నికాడి మోహన్, బురుసు సారయ్య, దుర్గం తిరుపతి, రౌతు బాబురావు, యాకూబ్, బాబు, ప్రకాశ్, ఫసీ పాల్గొన్నారు.

గూడెంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

గూడెం గుట్టకు పోటెత్తిన భక్తులు

దండేపల్లి, నవంబర్ 22 : మండలంలోని గూడెం రమాసహిత ఆలయంలో శుక్రవారం కార్తీక బహుళ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల సందడి కనిపించింది. ఆయా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం గుట్టపై భాగంలో ధ్వజ స్తంభం వద్ద, గుట్ట కింద భాగంలో రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 301 జంటలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించాయి. అనంతరం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

'మామిడి గూడెం' తరలిన యంత్రాంగం

● గ్రామంలో వైద్య శిబిరం.. పరిశీలించిన డీఎంహెచ్‌వో ● 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో, అధికారులు

కాసిపేట, నవంబర్ 22 : మామిడిగూడెంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయంటూ శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'మంచం పట్టిన మామిడిగూడెం' శీర్షికన కథనం ప్రచురితమయ్యింది. ఇందుకు యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు శుక్రవారం మామిడిగూడెం గ్రామాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్ రాజ్ సందర్శించారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 62 మందికి సేవలు అందించారు. 12 మందికి రక్త పరీక్షలు చేశారు. కొందరిని బెల్లంపల్లి దవాఖానకు రెఫర్ చేశారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించింది. అధికారులు మురుగు కాలువలను పరిశీలించారు. నీరు నిలువకుండా చూడాలని.. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు వైద్య శిబిరం కొనసాగుతుందని వైద్యాధికారులు తెలిపారు. తహసీల్దార్ భోజన్న ఇంటింటికీ జ్వర పీడితులను పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని మాజీ సర్పంచ్ సంపత్ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యాధికారి డాక్టర్ కిరణ్, వైద్య అధికారులు శ్రీనివాస్, నాందేవ్, బుక్క వెంకటేశ్వర్, వెంకట సాయి, మాజీ సర్పంచ్ సంపత్ నాయక్, కార్యదర్శి శ్వేత, చందు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నుంచి సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

గనుల వేలానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

శ్రీరాంపూర్, నవంబర్ 22 : సింగరేణి గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం శ్రీరాంపూర్ ఓసీపీపై కార్మికుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గోమాస ప్రకాశ్, నాయకులు సబ్బు ప్రేమ్‌కుమార్, మిడివెల్లి రాజ్‌కుమార్ శ్రీరాంపూర్‌తో పాటు ఓసీపీ, నస్పూర్‌లో కార్మికుల వద్ద సంతకాలు సేకరించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గనుల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని, సింగరేణి సంస్థకే గనులను అప్పగించాలని డిమాండ్ చేశారు. గనులను పెట్టుబడి దారుల చేతిలో పెట్టి సింగరేణిని నిర్వీర్యం చేయవద్దని హెచ్చరించారు. సింగరేణికే గనులు ఇచ్చే వరకూ సీపీఎం, సీఐటీయూ పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్, మోహన్ పాల్గొన్నారు.

అంబానీకి బీఎస్ఎన్ఎల్, అదానీకి సింగరేణి ఆస్తులు

కాసిపేట, నవంబర్ 22 : కేంద్రం అంబానీకి బీఎస్ఎన్ఎల్, అదానీకి సింగరేణి ఆస్తులు కట్టబెడుతున్నదని సీపీఎం నాయకులు ఆరోపించారు. శుక్రవారం మండలంలోని కాసిపేట 2 ఇంక్లైన్ గని, కొండాపూర్ యాప, మల్కెపల్లి, కోమటిచేను, ముత్యంపల్లి, కాసిపేట ప్రాంతాల్లో కార్మికులు, ప్రజలు, రైతులు, మహిళలు, కూలీలతో సమావేశాలు నిర్వహించారు. సింగరేణి గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. వారు మాట్లాడుతూ మోడీ కుట్రలతో తెలంగాణకు నష్టమేనని తెలిసినా కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. పోరాటాలతోనే సింగరేణిని కాపాడుకోవచ్చని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, నాయకులు జంగుబాయి పాల్గొన్నారు.

కాసిపేట 2 ఇంక్లైన్ గనిపై సంతకాల సేకరణలో సీపీఎం నాయకులు

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందుల్లేకుండా చూడాలి

● ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ● దహెగాంలో కొనుగోలు కేంద్రం పరిశీలన ● విలేకరుల ఐక్యతను ప్రశంసించిన అధికారి

ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

దహెగాం, నవంబర్ 22 : వరిధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. లగ్గాం గ్రామానికి చెందిన ఇంగిలి చంద్రశేఖర్, చెమ్మకాని గంగన్న కొనుగోలు కేంద్రంలో ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ ఇకపై ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇద్దరు ప్రత్యేకాధికారులను నియమించి ఎలాంటి సమస్యల్లేకుండా చూస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు.

విలేకరుల ఐక్యతను ప్రశంసించిన కలెక్టర్

దహెగాం మండల విలేకరుల ఐక్యతను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ప్రశంసించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌ను ఆయన సందర్శించారు. ఇంత మారుమూల ప్రాంతంలో ఐక్యంగా ఉండి సొంత భవనం నిర్మించుకోవడంతో పాటు అందులోనే డా.బీఆర్ అంబేద్కర్ పేరుతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రంథాలయానికి కొన్ని పుస్తకాలు అందిస్తానని చెప్పారు. డీఎం జేవీ నరసింహారావు, ఏఎస్‌వో సాదీక్, డీసీవో బిక్కునాయక్, డీఆర్‌డీవో దత్తారావ్, సింగిల్ విండో చైర్మన్ కోండ్ర తిరుపతిగౌడ్, తహసీల్దార్ దామెర కవిత, ఎంపీడీవో రాజేందర్, ఏడీఏ మనోహర్ పాల్గొన్నారు.